# బ్రహ్మముడి

(1987)

భావనారాయణకి మెలుకువ వచ్చి చూసేసరికి రైలు ఏదో స్టేషన్‌లో ఆగివుంది. ప్లాట్‌ఫాంమీద జనం అట్టే మంది లేరు. కంకర పోసి సాపు చేసిన ప్లాట్‌ఫాం మీద ఆ కొసనొకటీ ఈ కొస నొకటీ చమురు దీపాలు మినుక్ మినుక్ మంటున్నాయి—

వాచీవంక చూశాడు. రెండయింది. చుట్టూ చీకటి విలయతాండవం చేస్తూంది. దానికితోడు చినుకులు, కంపార్ట్‌మెంటు కూడా రద్దీగా లేదు. ఉన్నకొద్దిమందీ ఆ మూలా ఈ మూలా పడుకొని ఉన్నారు.

భావనారాయణ కళ్ళు మూసుకున్నాడు. అన్నీ సవ్యంగా వుంటే తెల్లారేసరికి గమ్యం చేరిపోతాడు. ఇక అదే ఆఖరు. మళ్ళీ యిటువంటి ప్రయాణం తను జీవితంలో చేయనక్కరలేదు.

—ఎందుకో ఆ ఆలోచన భావనారాయణకు బాధనే కలిగించింది.

పంథొమ్మిదోఏట జేరేడు, రైల్వేలో ఉద్యోగిగా, రిలీవింగ్ క్లర్కు దగ్గర్నించి స్టేషన్ మాస్టర్ వరకూ అన్ని రకాల పనులనూ నిర్వర్తించాడు. మరో మూడేళ్ళలో తనకు ప్రభుత్వం విశ్రాంతి నివ్వబోతోంది. ఈలోగానే అనుకోకుండా మళ్ళీ వంశధార ట్రాన్స్‌ఫర్. వంశధారకు వెళ్ళడం యిది రెండోమారు. పదేళ్ళక్రితం అక్కడే తను స్టేషన్ మాస్టర్‌గా చేశాడు.

చుట్టూ అడవి, కొండలు, దగ్గరగా వంశధార నది, ఊరికి దూరంగా రైల్వేస్టేషనూ.... ప్లాట్‌ఫాం మీదనే క్వార్టర్సూ, మొదట్లో ఎంతో భయమనిపించింది. కానీ అక్కడి మనుషుల్నీ, వారి జీవిత విధానాన్నీ చూశాక, వారిలో ఒకడిగా కలిసి మెలిసినపుడు....అక్కడే ఎంతో హాయివుందనిపించింది.

ఆ ఆనందమొక్కటే మిగిలిపోతే ఎంత బావుండేది!

భావనారాయణ మనసంతా ఒక్కమారు బాధతో నిండిపోయింది. కనురెప్పల క్రింద నీరు భారంగా కదిలింది.

చినుకుల జోరు హెచ్చినట్లయింది. కిటికీలోంచి ఒకటి రెండు తుంపరలు భావనారాయణ ముఖంమీద పడ్డాయి. స్టేషన్‌లో గంట మ్రోగింది. ఆ వెంటనే గార్డు విజిలూ కూతవేసి రైలు తాపీగా బయల్దేరింది! అప్పటి వరకూ ఎక్కడో వున్న చల్లగాలికూడా అమరా బాదరాగా కంపార్టుమెంట్లోకి జొరబడింది—

"ముసలి వయసులో వంటరితనం చాల దుర్భరమైంది" అనుకున్నాడు భావనారాయణ దుప్పటిని పైకి లాక్కుంటూ. అతనికి భార్య గుర్తుకొచ్చింది. భార్యతో గడిపిన మధురక్షణాలు కళ్ళముందు కదలాడాయి. ఆమె ఆ విధంగా తనను విడిచిపెట్టి పోతుందని అనుకోలేదు.

ఆరోజూ ఇలాగే వర్షం. వంశధారకి రావలసిన రైళ్ళన్నీ వచ్చి వెళ్ళాయి. తను డ్యూటీ దిగి యింటికొచ్చేసరికి రాత్రి ఎనిమిదైంది. తనకోసం ఎదురు చూస్తూమూలగా చాపేసుకుకూర్చుంది భార్య-పరిస్థితి అర్థమైంది. బాబు మంచంమీద నిద్రపోతున్నాడు.

స్నానంచేసి, భార్యకు విస్తట్లో భోజనం పెట్టి తనూ పెట్టుకున్నాడు. వర్షపు హోరు హెచ్చింది. అసలే అడవి ప్రాంతం. అందులోనూ ఊరికి దూరంగా వుండటం, వర్షపు రాత్రులు భయంకరంగానే వుంటుంది.

ఆ ఊకొచ్చిన కొత్తలో అతనికి ప్రతిరాత్రీ భయంకరంగానే గడిచేది. "రాత్రి పులి అరుపు వినిపించింది. దివిటీలు వెలిగించి, డప్పులుకొట్టి వెళ్ళగొట్టాం" అనో, "ఎలుగుబంటొచ్చి మేకల్ని ఎత్తుకుపోయింది" అనో విషనాగు కరిచిందనో ఊరివాళ్ళు తరుచు చెబుతూనే వుండేవారు.

క్రమంగా ఆ భయానికి అలవాటు పడ్డాడు భావనారాయణ. అయినా తన జాగ్రత్తలో తనుండేవాడు. ఇంటి చుట్టూ కంచె పెట్టించేడు. వర్షపురోజుల్లో నీరుపోయే గది తూముల్లో కర్రలు పెట్టేవాడు పురుగు పుట్రా రాకుండా.

కానీ అతనికెప్పుడూ ఏ క్రూరజంతువూ, ఏ విషసర్పమూ కన్పించలేదు—

"మనం వాటికి హాని చేయనపుడు అవీ మనల్నేం చేయవు" అనేవాడు ధైర్యంతో.

ఆ రాత్రి భోజనాలు చేస్తూ ఎన్ని సంగతులో మాట్లాడుకున్నారు. తనూ, భార్యా—

కొడుకు చదువుకోసం పరోఊరు బదిలీ చేయించుకోవాలనుకున్నారు. ఎన్ని కష్టాలుపడ్డా కొడుకుని డాక్టర్ని చేయాలనుకున్నారు. ఆ తర్వాతఏదైనా మంచి ఫూళ్ళో ఓ చిన్న ఇల్లు కట్టుకోవాలనుకొన్నారు.

భోజనాలయ్యాయి. ఆకు మడతపెట్టి చెంబుతో నీళ్ళు పట్టుకొని బయటకెళ్ళిందామె. వంటిల్లు సర్దడంలో నిమగ్నమయ్యాడు భావనారాయణ. సర్దుబాటంతా పూర్తయినా భార్య లోపలికి రాకపోవడంతో అనుమానంగా బయటికివెళ్ళి చూశాడు. అంతే! ఆమె కన్పించలేదు. గొడుగూ, లాంతరూ పట్టుకెళ్ళి ఆ చుట్టూ వెదికాడు. ఒంట్లోని శక్తి నంతా కూడదీసుకుని కేకలు పెట్టాడు. కానీ అదంతా అరణ్య రోదనే. అయింది.

ఆ మర్నాడు ఆ వార్త వూరంతా గుప్పుమంది,
సందేహంలేదు. పులివాతే అన్నారంతా.
అయినా మనిషో దిక్కూ పరుగెత్తేరు.

ఆ సాయంకాలానికి నిజం నిరూపణయింది. ఆ అడవిలో ఆమె చీరముక్కలూ, గాజుముక్కలూ కన్పించాయి.

ఇది జరిగిన కొద్దిరోజులకే అధికారులతనిపై జాలిదలచి మరో ఊరు బదిలీ చేశారు.

అప్పటికిప్పుడు మళ్ళీ—

భావనారాయణ బరువుగా నిట్టూర్చేడు.

రైలుబండి నత్తలా నడుస్తోంది. అసలే మీటర్ గేజి. అందులోనూ వర్షం. వాగులు పొంగినా రైలుకట్టలే కొట్టుకు పోతాయా ప్రాంతంలో.

ఆలోచనలకు స్వస్తి చెప్పి నిద్రపోవడానికి పలువిధాలా ప్రయత్నించాడు భావనారాయణ. కానీ అతనికెందుకో సాధ్యం కావడంలేదు. రిటైరయ్యేవరకూ అసలీ ఉద్యోగాన్ని చెయ్యకూడదనే అనుకొన్నాడు కొన్నాళ్ళు—కానీ ఈ ఒంటరితనం, తప్పనిసరి పరిస్థితులూ అతని ఆలోచనలకు వ్యతిరేకమయ్యాయి.

భావనారాయణ ఆలోచనలు కొడుకు మీదకి మళ్ళేయి. ఎంత తెలివైనవాడు! ఆ తెలివి తేటల్ని చూసి వుప్పొంగిపోయేది వాళ్ళమ్మ. కానీ జరిగిందేమిటి? చదువులో శబాష్ అనిపించుకున్న వాడు జీవితంలో చేతగానివాడయ్యాడు. పిరికి వాడయ్యాడు.

పిరికివాళ్ళసలు ప్రేమ వ్యవహారాలకు తగరు. నిట్టూర్చేడు భావనారాయణ. ఆలోచనల్లో ఎప్పుడో నిద్రపట్టేసింది.

తెల్లవారేసరికి రైలు గమ్యాన్ని చేరుకుంది.

o o o

వాచీవంక చూశాడు భావనారాయణ. అర్ధరాత్రి కావటానికి యింకో అరగంట టైముంది. బండి రావటానికి మరో ఇరవయి నిముషాలు పట్టింది. సీట్లోంచి లేచి వరండాలోకొచ్చాడు భావనారాయణ. ప్లాట్ ఫాం మీద దీపాలు మినుక్ మినుక్ మంటున్నాయి. పాయింట్స్ మెన్ అప్పన్న కర్రబెంచిమీద కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

ఆకాశంలో నల్లమబ్బులు బారులు బారులుగా వ్యాపిస్తున్నాయి. చుట్టూ తన బతుకు లాంటి చీకటే! ఆ చీకట్ని చీల్చుకుంటూ ఆకాశంలో వుండీ వుండీ మెరుపులు, గమ్యం తెలియని తన చీకటి బ్రతుకులో ఎప్పటికైనా ఏ వెలుగు కిరణమైనా జొరబడుతుందా' అనుకున్నాడు భావనారాయణ మనసులోనే. ఎక్కడో యేకాకి పక్షి ఆర్తనాదంలాంటి కూత పెట్టింది.

ప్రకృతంతా నిశ్శబ్దం. ప్లాట్ ఫాం మీదున్న నిద్ర గన్నేరు చెట్టు మొదట్లో పడుకున్న బిచ్చగాడికి వాడు వేసిన పిడికెడు మెతుకులూ తిని విశ్వాసంతో కాపలా కాస్తూందో వూరికుక్క.

బ్రతుకు వెళ్ళమారడంకోసం అడివిలాంటి వూళ్లో యేకాకిగా పనిచేస్తున్న తనకూ, దానికీ దగ్గర పోలికలు కన్పించాయి.

ఎవరిని సుఖపెట్టాలి తను? చివరి క్షణాల్లో ఎవరాదుకుంటారు తనను? ఆ క్షణంలో కొడుకు గుర్తుకొచ్చాడు భావనారాయణకు చక్రధరం బతికే వుంటాడని మనసు మారుమూలలో ఎక్కడో ధైర్యం— ఏనాటికైనా తనను వెదుక్కుంటూ వస్తాడనీ. చరమదశలో గొంతులో గుక్కెడు తులసి తీర్థంపోసి తలకొరివి పెడతాడనీ ఆశ,

ఆ ఆశే తనను బతికిస్తోంది.

చక్రధరం తలపుకొస్తే మనసంతా వికలమైపోతుంది భావనారాయణకు. 'నిక్కమైన పుత్రుడొక్కడు చాలడా' అని మురిసిపోయాడు. బడిలో బాలభానుడిలా ప్రకాశించే చక్రధరాన్ని చూసి. అంతటి చురుకుదనం తెలివితేటలూ కలవాడు, తనగమ్యాన్ని వెతుక్కోవడంలో విఫలుడయ్యాడు. ప్రేమ వ్యవహారం బెడిసికొట్టి పిచ్చివాడయ్యాడు. దానికితోడు నిరుద్యోగం.

మొత్తానికి చక్రధరం తనక్కాకుండా పోయాడు.

ఆలోచనలు మనసుని దొలిచేస్తున్నా విధి నిర్వహణలో మాత్రం యంత్రంలా పనిచేస్తూనే వున్నాడు భావనారాయణ.

రైలు సిగ్నలింగ్ స్టేషను దాటి వచ్చేసిందప్పుడే.

స్టేషన్ రూంలోంచి బయటికొచ్చి నిల్చున్నాడు భావనారాయణ. సాధారణంగా ఆ సమయంలో అక్కడ దిగే పాసింజర్లట్టే మంది వుండరు. అయినా అంతా యథావిధిగా జరుగుతుంది. పది నిముషా లాగి ఆయాసం తీరాకనే బయల్దేరుతుంది బండి.

ఇంజను ప్రక్కనున్న పెట్టెలోంచి ఓ ముసలమ్మా, గార్డుపెట్టె కిపతలనుండి ఓ జంటాదిగేరంతే.

ముసలమ్మని చూస్తే అప్పటెప్పటి సంగతో గుర్తుకొచ్చింది భావనారాయణకి. ఆ రోజూ యిలాగే బండిలోంచి తట్టతో ఓ ముసిల్ది దిగింది. తీరా చెక్ చేస్తే ఆమెదగ్గర టిక్కెట్టులేదు. 'బీదోళ్ళం బాబయ్యా. కాయకష్టం చేసుకు బతికేదాన్ని, డబ్బుల్లేక టిక్కెట్ కొన్లేదు, దేవుళ్ళా టోడివి ఈ పాలికి నా తప్పుకాయి' అంటూ అర్థించింది.

విధి నిర్వహణలో యమధర్మరాజనే బిరుదుంది తనకు, ముసిల్దానిపై జాలి కలిగినా కర్తవ్యం తనను కట్టి పడేసింది.

'ఏ ఊరు నీది?'

చెప్పింది ముసల్ది—

'తట్టలో ఏమున్నాయి'

'మిరపకాయలు బాబయ్యా—చీమ్మిరపకాయలు'

'సరే తట్టక్కడుంచి రేపు డబ్బులు తీసుకురా'

ముసిల్ది ఆ రాత్రంతా కాళ్ళా వేళ్ళా పడింది వదిలేయమని. తను మాత్రం లొంగలేదు. నిరాశగా ఆ మర్నాడు వెళ్ళిన ముసలిది మరి రాలేదు.

"సార్ యిక్కడ వెయిటింగ్ రూం లేదా!"

పరిశీలనగా అటువంక చూశాడు భావనారాయణ. రెండు చేతుల లోని పెట్టెలనూ క్రిందపెట్టి అడుగుతున్నాడా యువకుడు. అతని వెన కాలే అతని భార్య కాబోలు!

'నా పేరు గోపాలక్రిష్ణ సార్. ఈ ప్రాంతానికి రావడం యిదే కొత్త. రేపు ఉదయం వరకూ తలదాచుకునే వీలుకల్పించారంటే....' అంటున్నాడు—ఆ ముఖంలో అభ్యర్థన ఉంది.

'ఎక్కడకు వెళ్ళాలి మీరు?'

చెప్పాడతడు—'ఉన్నపళంగా ట్రాన్స్‌ఫర్ అన్నారు బయలు దేరి వచ్చేయక తప్పలేదు'—

ఆలోచించాడు భావనారాయణ. తెల్లారేలోగా మరే ట్రైనూరాదు. గది తాళంవేసి పాయింట్స్‌మేన్‌కి చెప్పి బయలుదేరి, 'రండి నాతో' అన్నాడు గోపాలక్రిష్ణ వైపు తిరిగి.

'ఈ అడివి పూళ్ళో పగలే సెక్యూరిటీలేదు. రాత్రులు ప్రమాద మని వేరే చెప్పనక్కరలేదు. ఇక్కడే నాకు రైల్వే వారిచ్చిన క్వార్టరు ఉంది. వుండేది నేనొక్కడినే. మీరిరువురూ ఈ రాత్రికి వుండొచ్చు రేపు మీ ఇష్టం" అన్నాడు.

అతని కళ్ళు కృతజ్ఞతా పూర్వకంగా మెరిసేయి.

క్వార్టర్సు చేరుకున్నాక తలుపుతీసి గది, బాత్రూమూ చూపిం. చేడు వారికి.

'మీరీరోజు నా అతిధులు, బంధువులతో సమాన మనుకుని నిస్సంకోచంగా వుంటండి. ఆ రెండు పట్టె మంచాలు మీరువాడొచ్చు' అని తన గదిలోకి వెళ్ళి ఫ్లాస్కు, హార్లిక్స్ బాటిలూ పట్టుకొచ్చి బల్ల మీద పెట్టి, 'అమ్మా నీ పేరేమిటో....కాస్త ఆయనకు కలిపిచ్చి నువ్వూ తీసుకో' అన్నాడు.

'మీకు చాలా శ్రమ కలిగిస్తున్నాం' అంది యశోధర.

అప్పుడే ఆమె ముఖంలోకి చూశాడు భావనారాయణ. అవేకళ్లు ....అదేముఖం...ఎక్కడో....ఎప్పుడో....ఎన్నేళ్ళ క్రితమో లీలగా చూసిన జ్ఞాపకాలు—

తన గదిలో మంచంమీద పడుకున్నా కంటిమీదకి కునుకు రాలేదు భావనారాయణకి. అన్నీ సవ్యంగావుంటే చక్రధరానికి కూడా ఈ పాటికి పెళ్ళయి ఉండేది. కొడుకూ, కోడలూ చిలకా గోరింకల్లా కాపురం చేసుకుంటూంటే వారి పంచన వుండి కాలం గడిపేసేవాడు.

కానీ తనకా అదృష్టమెక్కడిది?

ఆలోచనల్లో ఎప్పుడు పట్టిందో నిద్ర. మెలుకువ వచ్చి చూసే సరికి తెల్లగా తెల్లారిపోయింది. అప్పటికే లేచి స్నానంచేసి రెడీ అయి వున్నాడు గోపాలక్రిష్ణ. యశోధర వంటగదిలో కాఫీ కలుపుతోంది. చూడముచ్చటగా అన్పించిందా దృశ్యం భావనారాయణకి, వారి మధ్యో వలుసు తిరుగాడుతుంటే మరెంత బావుండేదో!

'బాగా ఆలస్యమైపోయింది. లేపకపోయారూ' అన్నాడు నొచ్చుకుంటూ.

'ఫర్వాలేదు లెండి యిప్పుడు మించిపోయిందేముంది. ఎలాగూ కాస్సేపాగితేగాని, బస్లు దొరకవనుకుంటాను.' అన్నాడు గోపాలక్రిష్ణ.

వాళ్ళు ప్రయాణమయ్యే ప్రయత్నంలో ఉన్నారని గ్రహించేడు భావనారాయణ. ముఖం కడుక్కొని వచ్చేసరికి కాఫీ తెచ్చి భర్తకూ, తనకూ అందిచింది యశోధర.

భార్యపోయాక తను కలుపుకోవడమేగాని ఎప్పుడూ ఎవరూ తనింట కాఫీ కలిసి యిలా యివ్వలేదు. భావనారాయణకు హృదయంలో సంతోషం, దుఃఖం పొంగి పొర్లాయి. ఆయన తాగకపోవటం చూసి

'తీపి సరిపోలేదాండి' అడిగింది యశోధర.

ఆ మాటకు తడబడి. 'సరిపోయిందమ్మా. సరిపోయింది' అన్నాడు.

'తీపి లేనిది నా జీవితంలోనే. అనుభవాలూ, జ్ఞాపకాలూ అన్నీ చేదుమయం.' అనుకున్నాడు మనసులో.

'మమ్మల్ని బంధువులుగా భావించుకోమన్నారు. కాబట్టి చొరవ తీసుకుని వంటింట్లోకి వెళ్ళాను!' అంది యశోధర నవ్వుతూ.

'మంచిదమ్మా. నాకెంతో సంతోషంగా ఉంది మీ యిరువుర్నీ చూస్తుంటే. మీరు మరో నాల్రోజులు యిక్కడుంటేగాని వెళ్ళడానికి వీల్లేదు.'

'అలాగనేయకండి సార్. అర్థరాత్రి—అపరిచితులకు ఆశ్రయమిచ్చారు అంతేచాలు. రేపు నేను డ్యూటీలో చేరాలి. ఇప్పుడు బయలుదేరి వెళ్లాలనుకుంటున్నాం' అన్నాడు గోపాలకృష్ణ.

'నా తృప్తికోసం ఈ ఒక్కరోజన్నావుండి వెళ్ళండి. వంటరితనంలోనూ, నైరాశ్యంలోనూ సంవత్సరాలు దొర్లుకుపోతున్నాయి. ఈ మధ్యకాలంలో నాకానందాన్నీ, తృప్తినీ కలిగిస్తున్నదీరోజే' అంటూ బయటకు నడిచాడు భావనారాయణ.

యశోధర, గోపాలక్రిష్ణ ముఖాలు చూసుకున్నారు. అతనిలో నిగూఢమైన బాధేదో వున్నట్లు బోధపడింది వారికి. కానీ అది ఏమిటని అడిగి తెల్సుకునే చనువుగానీ, ధైర్యంగానీ లేకపోయాయి యిరువురికీ.

'ఏం నిశ్చయించుకున్నారు' అంటూ కాస్సేపట్లోనే వచ్చాడు భావనారాయణ స్నానంచేసి.

"మీ ఆర్డర్ని త్రోసిపుచ్చి వెయ్యలేంసార్!" అన్నాడు గోపాలక్రిష్ణ.

భావనారాయణ ముఖం విప్పారింది. "ఆర్డర్ వెయ్యడానికి నేనెవర్నయ్యా. కాకపోతే నా స్వార్థం కూడా వుందిందులో. ఈ రెండు పూటలైనా మా అమ్మాయి చేతివంట రుచి చూడొచ్చని" అంటూ యశోధర వంక చూశాడు.

'అదేమన్నమాట. మీకేంకావాలో చెప్పండి. అదే వండుతా' అందామె.

'ఈలోగా మధ్యాహ్నం బయలుదేరి ఆ వూరెళ్ళి వస్తాన్సార్. అక్కడ యిల్లూ, వ్యవహారం చూడాలిగా. ఎలాగూ ఆరేడు మైళ్ళంటున్నారు కాబట్టి సైకిల్ మీద సునాయాసంగా వెళ్ళిరావొచ్చు!" అన్నాడు గోపాలక్రిష్ణ.

భావనారాయణ సరేనన్నట్లు తలూపేడు.

వివరాలన్నీ కనుక్కొని భోజనం చేశాక బయలుదేరాడు గోపాలక్రిష్ణ.

'సాయంకాలానికల్లా వచ్చేస్తారుగా' సైకిలెక్కబోతున్న భర్తను అడిగింది యశోధర.

'చీకటి పడకముందే వచ్చివాలనూ. అసలే అడవి ముండావూరు.'

ఆమెకు కావల్సినవి చూడ్డానికి పాయింట్స్‌మెన్‌ని నియమించి తనుకూడా స్టేషన్‌కి బయలుదేరాడు భావనారాయణ. పగటిపూట వెళ్ళవలసిన మూడు బళ్ళూ వెళ్ళిపోయాక యింటికి బయలుదేరేడు. అప్పటికి చీకటి పడింది. అర్థరాత్రి బండికోసం మళ్ళీ భోజనం చేసి వస్తే సరిపోతుంది.

ఇంటికి వచ్చిన భావనారాయణకు గుమ్మంలో దిగులుగా కూర్చున్న యశోధర కన్పించింది.

'గోపాలక్రిష్ణ రాలేదేమిటమ్మా'

'లేదండీ—నాకూ అదే ఆందోళనగా వుంది' అంటూ లేచింది.

'కంగారేం లేదమ్మా ఈ పాటికి వచ్చేస్తుంటాడు. అని ధైర్యం చెప్పినా. భావనారాయణ మనసులో ఏదో కీడు పొడచూపింది.

అసలే యితను కొత్తవాడు. వెళ్ళింది అడవి మార్గంగుండా.

అనుకోనిదేదైనా జరిగితే—? తను మరీమరీ చెప్పాడు— సాయంకాలానికల్లా తిరిగి వచ్చేయమని.

క్లాస్పేపక్కడే పచారిచేసి బేటరీలైటు తీసుకుని బయలుదేరాడు ఏడు—ఎనిమిది—ఎనిమిదిన్నర—గోపాలక్రిష్ణ రాలేదు. యశోధర కంగారుపడుతోంది—

'మరేం భయంలేదమ్మా ఎలాగూ చీకటి పడిపోయిందని ఈ రాత్రికి అక్కడే వుండిపోయి వుంటాడు. రేపెటూ జాయిన్ కావాలిగా— మస్టర్లో సంతకం చేసేసి ఉదయాన్నే బయలుదేరి వచ్చేస్తాడు' అన్నాడు తిరిగొచ్చి.

యశోధరేం మాట్లాడలేదు.

* * *

డ్యూటీ చేస్తున్నాడన్నమాటేగాని మనసంతా యింటిమీదేవుంది— భావనారాయణకి. ఎరక్కపోయి లేనిపోని లంపటాన్ని తగుల్చుకున్నాడనిపించింది. ఆతిథ్య మిచ్చినవాడు అక్కడితో వూరుకోక వాళ్ళనెందుకు వుండమన్నట్టు? వుండమంటే మాత్రం? ఆ వెళ్ళిన గోపాలకృష్ణ అనుకున్న ప్రకారం రాకపోవడమేమిటి? ఇంట్లో వంటరి ఆడకూతురు. విధినిర్వహణలో తను.

భావనారాయణ వెళ్ళేసరికి రాత్రి ఒంటిగంట దాటిం.ది

తలుపు తట్టడమే తరువాయి. చటుక్కున తెరిచింది యశోధర. ఆ ముఖంలోని ఆత్రుత. ఆ వెనకే ఆవరించిన దిగులుచూసి మరేం మాట్లాడలేకపోయాడు.

'రేపటివరకూ ఏ ఆలోచనలూ లేకుండా నిద్ర పోమ్మా—అదివన్నమాటే గాని. పూర్వమున్నంత భయం యిప్పుడులేదు.' అని తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ 'రేపు' రానే వచ్చింది. గోపాలకృష్ణమాత్రం రాలేదు.

సైకిల్ తీసుకుని తనే బయల్దేరుదామనుకున్న భావనారాయణకు అశని పాతంలాంటి ఆ వార్త అందనే అందింది.

ముళ్ళదొంకల మధ్య చిక్కుకుపోయి కట్టెగా మారిన వ్యక్తి గోపాలక్రిష్ణే అని తెలియడానికాట్టేసేపు పట్టలేదు. జంతువులు హత మార్చాయనటానికి అతని వంటిమీద ఎటువంటి గుర్తులూ కన్పించ లేదు.

చీకట్లో ముళ్ళదొంక చొక్కాకి తగులుకుంటే ఏదో లాగినట్లు భావించి భయపడి ప్రాణాలొదిలేసుంటాడనే నిర్ణయానికొచ్చారావూరి వారంతా—

భావనారాయణకి ఏం చేయడానికీ తోచలేదు.

యశోధర దుఃఖం మాత్రం వరద వంశధారా నదే అయింది.

*　　　*　　　*

'ఎవరికేది రాసి పెట్టివుంటే అదే ప్రాప్తం' అనేది కర్మ సిద్ధాంతం. లేకపోతే ఏమిటి? ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగిన గోపాలక్రిష్ణ అడివిదారిలో అర్ధరాత్రి భయంతో గుండాగి చావడ మేమిటి? ఏ బంధమూ లేని తను ఒకరోజు ఆశ్రయమిచ్చిన పాపానికి అతడ్ని పిడికెడు బూడిద చెయ్యడమేమిటి? దగ్గర బంధువు లెవరూ లేని యశోధర అనాధగా తనయింట్లో మిగిలిపోవడమేమిటి?

ప్రాప్తమున్న తీరానికి పడవ సాగి పోతుందంటే యిదేనేమో!

చీకటి ముంగిట్లో పున్నాగ చెట్టుక్రింద కూర్చుని నిద్రరాని ఆలోచనలతో సతమతమౌతున్న భావనారాయణ తలుపు తీసిన చప్పు డైతే అటువంక చూశాడు.

చీకటిలో ఓ ఆకారం కదిలి వెళ్ళిపోతోంది.

'ఎవరూ....యశోధరా....!' నెమ్మదిగానే పిలిచినా ఆనిశ్శబ్దంలో ఖణేల్మన్నాయా మాటలు.

ఆ ఆకారం పరుగెత్తింది. భావనారాయణలేచి ఓపికా ధైర్యం తెచ్చుకుని నాలుగంగల్లో ఆమె జబ్బందుకున్నాడు.

బ్రద్దలైన అగ్నిపర్వతంలా బావురుమంది యశోధర. గుండెల్లోంచి ఉబికే దుఃఖాగ్ని కళ్ళనుండి లావాలా జారిపోతోంది.

రెండు చేతులతోనూ ఆమెను ఒడిసిపట్టుకొని గదిలోకి తీసుకొచ్చి మంచం మీద కూర్చోబెట్టాడు.

నిశ్చలంగా ఆ గదిలో వెలుగుతూన్న గోరంత దీపపు వెలుగులో ఆమె మూర్తీభవించిన శోకదేవతలా కనిపించింది. అశోక వనంలో సిగముడివేయని సీతలా వుంది. లోకంకోసం గౌతమునిచే విడిచిపెట్టబడిన బుద్ధ భగవానుని ధర్మపత్ని యశోధరలానే కన్పించింది భావనారాయణ కళ్ళకి, ఆ క్షణాన.

'నేను పాపిష్టిదాన్ని బాబాయిగారూ. నాలాంటి దౌర్భాగ్యపు జీవి మిగిలి వుండేకంటే చావటమే మేలు' ఆమె ఏడుస్తూనే వుంది.

వీధి తలుపు గడియవేసి కుర్ర కుర్చీని ఆమెకు కాస్త దూరంలో లాక్కుని కూర్చున్నాడు భావనారాయణ,ఆమెలో దుఃఖపు పొంగు కాస్త చల్లారింది. వెక్కిళ్ళు నెమ్మదిగా తగ్గుముఖం పట్టాయి.

'చూడమ్మా యశోధరా. జీవితం చాలా విచిత్రమైనది. ఏ కొండకోనల్లోనో పుట్టి ఎక్కడెక్కడో ప్రవహించి ఎన్నెన్ని మలుపులో తిరిగి. కడకు ఎక్కడో కల్సిపోయే నదిలాంటిదది. కొన్ని జీవితాలు పరవళ్ళు తొక్కుతూ ఆనంద సాగరంలో సంగమిస్తాయి. కొన్ని అర్థంకాని ముగింపుతో మధ్యలోనే ఆగిపోతాయి. కొంత సందిగ్ధం. కొంత నైరాశ్యం. బ్రతుకుమీద నిష్పర్తిత, ఆశలూ, మమకారాలూ అడుగంటిపోతాయి. కానీ చివరిదాకా బ్రతకాలి. మనం ఈ భూమ్మీదకి రావటానికి మన ప్రమేయంలేదు. అలానే చావుకూడా మన ప్రమేయం లేకుండానే సహజంగా జరిగిపోవాలి. అంతవరకూ ఎదురు

చూడాలి. బలవస్మరణం సమస్యకు పరిష్కారం కాదమ్మా. జీవిం చాలి. జీవించగలగాలి! అవసరమైతే కొత్తగా జీవించడం నేర్చు కోవాలి.'

కళ్ళు తుడుచుకుని అతనివంక చూసింది యశోధర. ఏ దివ్య శక్తో అతనిలో ప్రవేశించిందా అన్నట్లున్నాడాయన.

'నన్ను చూడు. కొమ్మలన్నీ కొట్టివేయబడ్డ మానులాంటి వాడిని. ఈ మోడులోంచి ఏ ఆశలూ చిగురించవు. అయినా ఖిలా నిలిచి జీవించడం....ఎవరికైనా ఉపయోగపడాలని ఆరాటపడ్డం....'

భావనారాయణ గొంతు బొంగురుపోయింది. ఆ వెంటనే సర్దు కొని.

'నీ ఈ స్థితికి ఒకవిధంగా నేనే కారణం. ఆ పాప పరిహారం కోసమైనా నిన్నీ స్థితిలో ఆదుకోవాలి' అతనివంక ఆశ్చర్యంగా చూసింది.

'మీరేం చేశారని? అన్నిటా దురదృష్టవంతురాల్ని నేను. పుడు తూనే తల్లినీ, పదేళ్ళప్పుడు తండ్రి నీపోగొట్టుకున్నాను. ప్రేమించిన వాడితో అనుభవాన్నే గాని అనుబంధాన్ని పొందలేకపోయాను. విధి నిర్ణయించిన సంబంధం ఈ విధంగా కడతేరిపోయింది. ఇక ఎందుకు బతకాలి? నేను మీకు భారమై ఏం సాధించాలి?

'నాకూ ఓ కూతురుండి అదీ యిటువంటి సమస్యలోనే వుండి వుంటే ఆదుకోకుండా వుండగలనా యశోధరా'.

సుళ్ళుతిరిగిన కన్నీళ్ళతో ఆమె కళ్ళు మెరిసాయి.

మెరిసే కళ్ళతో అతని వంక చూసింది.

ఆ చూపులోని భావం వ్యక్తం చేయటానికి మాటలు చాలవు.

0 0 0

"ఈ ఫోటో ఈ ఇంటి ఇల్లాలిదమ్మా. ఆ కళ్ళలోని సిరి కొట్టొచ్చినట్టు కన్పించడంలేదూ– ఆమెతోపాటు అదీ పోయింది."

గుమ్మంలో కూర్చొని ఆల్బమ్‌లోని ఫోటోలను చూపిస్తున్నాడు భావనారాయణ– ఆసక్తిగా చూస్తూ ఆయన చెప్పేది వింటోంది యశోధర.

"ఇది పెళ్ళయిన రెండు నెలలనాటిది. నా ప్రక్కన నిలబడ్డానికే వూరంత సిగ్గుపడిపోయింది. మా చక్రధరాన్ని చూడు. ఏడ్నర్థంవాడు. నల్లగావున్నా బొద్దుగా కళగా ఉండేవాడు."

ఫోటోల్ని చూపిస్తూ యశోధర వంక చూశాడు భావనారాయణ. ఆమె ఆలోచనల్లో ఎక్కడో వుంది.

"ఇది మా చక్రధరం డిగ్రీఫోటో!"

యశోధర ముఖంలో రంగులు మారటం భావనారాయణ గుర్తించకపోలేదు,

ఆమె మాత్రం అయోమయంగా అతని వంక చూస్తోంది.

"చక్రధరం చదువులో ఎంత తెలివైనవాడో జీవితంలో అంత పిరికివాడమ్మా. ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకోలేనంత మాత్రాన దేశాల పాలవ్వాలా? నన్నడిగితే అటువంటి పిరికివాళ్ళు ప్రేమించడానికి అర్హులుకారు,"

యశోధర గుండెల్లో అగ్నిపర్వతాలు బ్రద్దలౌతున్నాయి.

ఏమిటీ సంబంధం? ఎక్కడిదీ బ్రహ్మముడి?

ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

* * *

"మిమ్మల్ని ఓ విషయం అడగాలనుకుంటున్నాను" వాలు కుర్చీలో కూర్చొని భగవద్గీత చదువుకుంటున్నవాడల్లా తలెత్తి యశోధర వంక చూశాడు భావనారాయణ.

"నన్నసహ్యించుకున్నా ఫర్వాలేదు. నా మనసులోని కోర్కెను మాత్రం మీ ముందుంచకుండా వుండలేను!"

"ఏమిటో చెప్పమ్మా"

"నాతోపాటు నా బిడ్డనూ మీరు భరించగలరా?" నమ్మలేనట్లు ఆమెవంక చూశాడు భావనారాయణ.

"మీరందుకు అనుమతిస్తే జీవితాంతం మీకొక దాసిలా సేవ చేస్తాను. మిమ్మల్ని దేవుడిలా పూజించుకుంటాను. తండ్రిలా గౌరవిస్తాను."

"అంతే....అంతే....! భావనారాయణకేదో అర్థమౌతోంది.

"మీ ఔదార్యం చూసి, మీమాటలు విన్నాక నాలోని పిరికితనాన్ని విడిచి పెట్టాలనుకున్నాను. ఉన్న నిజాన్ని మీ ముందుంచాలనిపించింది. నాబిడ్డ....నా పెళ్ళికి ముందు కలిగిన బిడ్డ....అనామకంగా పెరగడం, అనాథగా బ్రతకడం అన్యాయమనిపిస్తోంది. మీరనుమతిస్తే నా బిడ్డను నా దగ్గరే—" ఆమె గొంతు పూడుకుపోయింది.

ఆతనికేదో అర్థమైంది.

ఇద్దరి కళ్ళూ వర్షిస్తున్నాయి.

"నా మనుమడు ఎక్కడో పెరగడమేమిటమ్మా. వాడు—వాడు—ఈ ఇంటి వెలుగు. నా కలలపంట. నాకెందుకో ఈ సమయంలో చక్రధరం గుర్తుకొస్తున్నాడమ్మా. వాడు తప్పకుండా వస్తాడనీ—తన కొడుకుని చూసుకుని—"

"మామయ్యగారూ!" ఆమె గొంతులో ఓ వింత వణుకు

"అవునమ్మా నా అనుమానం నిజమైనందుకు సంతోషంగా వుంది—" అని, లేచివెళ్ళి చక్రధరం పుస్తకాల్లోంచి ఓ ఫోటోను బయటకు తీశాడు. అది యశోధరది.

"విధాత వేసిన బంధమమ్మాయిది—బ్రహ్మముడి."

భావనారాయణ కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి.

నైరాశ్యపు చీకట్లు తొలగిపోయి ఆ యింట ఓ కొత్త వెలుగు జొరబడుతున్నట్లనిపించిందాయనకు—ఆక్షణాన